పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## పెట్రో భయాలు!

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. చర్చలు జరుగుతున్న వేళ అనూహ్యంగా అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి ప్రస్తుతం గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) దేశాలంతటా వ్యాపించింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, మంగళవారానికి పది డాలర్లపైన పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున 40 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది. ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల (2 బిలియన్ డాలర్లు) అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024-25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగవచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం నాడు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40-45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందు చూపునకు నిదర్శనం. ఈ పరిణామాల నేపథ్యంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఒత్తిడికి లొంగి, తక్కువ ధరకు లభించే రష్యా చమురు దిగుమతులను భారీగా తగ్గించేందుకు అంగీకరించిన విషయం తెలిసిందే. దీంతో రష్యా నుండి రోజుకు సుమారు 20 లక్షల బ్యారెళ్ల మేరకు వచ్చే దిగుమతులు 10 లక్షల బ్యారెళ్లకు తగ్గాయి. అమెరికాకు ఇచ్చిన హామీ ప్రకారం రానున్న రోజుల్లో దీనిని మరింతగా తగ్గించాల్సి ఉంది. ఈ నిర్ణయంపై అప్పట్లో ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తినా కేంద్రం పట్టించుకోలేదు. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా చేసిన దాడి, హార్ముజ్ జలసంధి మూసివేతతో మన దేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారింది. 40 రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రో ధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరుగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి.

## సమస్యలకు సైనిక చర్యలు పరిష్కారం కాదు- యుద్ధాలకు ముగింపు పలకాలి: మోదీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారమని అన్నారు. దిల్లీలోని హైదరాబాద్ హౌస్?లో గురువారం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉంది. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతిపై భారత్, ఫిన్లాండ్ నమ్మకం ఉంచుతున్నాయి" అని తెలిపారు. ఏ సమస్యకూ సైనిక ఘర్షణలతో పరిష్కారం రాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధమైనా, పశ్చిమాసియా సంక్షోభమైనా వీలైనంత త్వరగా ముగియాలని, శాంతి నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, పరస్పర గౌరవం, శాంతియుత జీవనం ఆధారంగా పరిష్కారాలు కనుగొనాలని ప్రధాని మోదీ సూచించారు.

## అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా: స్పీకర్ అయ్యన్న



**అమరావతి, పతాకం న్యూస్:** అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలు ఎన్నికవుతారని... అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని అన్నారు. వైసీపీలో జగన్ మోహన్ రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని స్పీకర్ గుర్తు చేశారు. వైసీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే తగిన సమయం రావాలన్నారు. అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్‌లో సక్సెస్ అయితే దేశవ్యాప్తంగా సక్సెస్ అవుతుందని స్పీకర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వచ్చినా అది హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడ ఉందో 'నెంబర్ వన్ స్టూడెంట్' అని చెప్పుకునేవాళ్లు చూపించాలని సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే.. అది హాజరుగా పరిగణించబడదని స్పష్టం చేశారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని స్పీకర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డికి దక్కాల్సిన అన్ని గౌరవ మర్యాదలు లభిస్తున్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరు ఎమ్మెల్యేలతో సరదాగా ఉండేవారని గుర్తు చేశారు స్పీకర్. విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియో ప్రారంభోత్సవానికి సీఎంగా వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనను స్టేజ్‌పైకి ఆహ్వానించి, ప్రోటోకాల్ పాటించలేదని కలెక్టర్‌ను అక్కడే మందలించారని ఆనాటి అనుభవాన్ని స్పీకర్ మీడియాతో పంచుకున్నారు. అప్పట్లో అధికార-ప్రతిపక్ష సభ్యులు సభలో ప్రజా సమస్యలపై పోరాడినా బయట స్నేహంగా ఉండేవారని గుర్తు చేశారు. రాను రాను ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారని స్పీకర్ అన్నారు. శాసనమండలి అంటే పెద్దల సభగా.. పెద్ద ఆలోచనలు ఉన్నవారితో నిండి ఉండేదని.. ఇప్పుడు పెద్ద ఆలోచనలు లేని వారు ఉండటం వల్ల ఎలా ఉంటుందో చూస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

## ఎర్ర బుక్కులకు భయపడేది లేదు: అంబటి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కాపు నేతల కీలక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, కూటమి ప్రభుత్వంపై ముఖ్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరణం ధర్మశ్రీ నివాసంలో జరిగిన ఈ 'బ్రేక్ ఫాస్ట్ మీటింగ్'లో గుడివాడ అమర్నాథ్ వంటి కాపు నేతలతో కలిసి ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అక్రమ కేసులు, అరెస్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుంటూరులోని తన నివాసంపై జరిగిన దాడిని స్వయంగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని ఆయన ఆరోపించారు. టీవీ ఛానళ్లలో లైవ్ వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, పోలీసుల సమక్షంలోనే ఈ దౌర్జన్యం జరిగిందని మండిపడ్డారు. కేవలం దైవకృప వల్లే తాను ప్రాణాలతో బయటపడ్డానని అన్నారు. ఈ దాడిని ఒక కులం మరో కులంపై చేసిన దాడిగా ఆయన అభివర్ణించారు. సమాజంలో కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందని ప్రశ్నించారు. గతంలో వంగవీటి రంగాను కూడా పోలీసుల సహకారంతోనే చంపారని, ఇప్పుడు తన విషయంలోనూ అదే పునరావృతమవుతోందని ధ్వజమెత్తారు.లోకేశ్ 'రెడ్ బుక్' బెదిరింపులకు తాము భయపడబోమని, అక్రమంగా తనను 18 రోజులు జైల్లో పెట్టారని గుర్తు చేశారు.

## ఉగాది నాటికి టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తాం: నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలోని నగరాలు, పట్టణాల్లో జనాభా ప్రస్తుతం 36 శాతం ఉండగా, 2047 నాటికి 60 శాతానికి చేరుతుందని మంత్రి నారాయణ తెలిపారు. దీనికి తగినట్లుగా సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించామని చెప్పారు. గురువారం ఏపీ శాసనసభలో పురపాలకశాఖ బడ్జెట్ రూ.14,538కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చెత్త సేకరణ, నిర్వహణ, నీటి పునర్వినియోగం, ప్రతి ఒక్కరికీ ఇళ్లు, రోడ్లు, ఆసుపత్రులు, శ్మశానాలు వంటి అంశాలపై దృష్టి సారించామని మంత్రి వివరించారు. ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో 2100 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డంపింగ్ యార్డుల్లోని చెత్తను పూర్తిగా క్లియర్ చేస్తున్నామని.. జూన్ నాటికి అన్ని డంపింగ్ యార్డులు శుభ్రంగా తయారవుతాయని వెల్లడించారు. గతంలో 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని 2.65 లక్షలకు కుదించి, రంగులు మార్చిందన్నారు. ఇళ్లు కట్టకుండానే బిల్లులు చేసిందని విమర్శించారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రూ.4,451 కోట్లు హడ్కో రుణం మంజూరైందని.. ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తామని మంత్రి తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో 205 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 3.07 కోట్ల మంది అల్పాహారం, 3.64 కోట్ల మంది భోజనం, 1.59 కోట్ల మంది రాత్రి భోజనం తీసుకున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరో 75 క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేశామన్నారు. వివిధ శాఖల ఎన్‌ఓసీలను సింగిల్ విండో విధానంలో మంజూరు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని.. తణుకులో రూ. 691 కోట్లు, తిరుపతిలో రూ.147 కోట్లు కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ తర్వాత సమస్య పరిష్కారమవుతుందని మంత్రి తెలిపారు. రాజధాని అమరావతిని వైసీపీ మూడుముక్కలాటతో నాశనం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ల పాత బిల్లులు క్లియర్ చేశామని, మళ్లీ కొత్త టెండర్లు పిలిచి పనులు అప్పగించామని తెలిపారు. వర్షాలు ముగిసిన తర్వాత పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు ఈ నెలలో పూర్తవుతాయని అన్నారు. మిగతా అధికారుల భవనాలు రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. మున్సిపాలిటీలకు పన్నుల రూపంలో వచ్చిన రూ. 3,500 కోట్లను వైసీపీ దారి మళ్లించిందని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్ను డబ్బులను సంబంధిత మున్సిపాలిటీల్లోనే ఖర్చు చేసుకునేందుకు అనుమతించామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. ఆపై మున్సిపల్ బడ్జెట్ గ్రాంట్లను శాసనసభ ఆమోదించింది.

## ఏపీ అసెంబ్లీలో అస్వస్థతకు గురైన హోంమంత్రి అనిత.. నిలకడగా ఆరోగ్యం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అస్వస్థతకు గురయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సమయంలో ఆమెకు స్వల్పంగా నలతగా అనిపించడంతో, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనితకు రక్తపోటు (బీపీ) పెరిగినట్టు వైద్యులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి అనిత శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రధానంగా తిరుమల లడ్డూ వ్యవహారంపై జరిగిన చర్చలో కూడా ఆమె భాగమయ్యారు. మండలి సమావేశాలు వాయిదా పడిన తర్వాత, అసెంబ్లీ కొనసాగుతున్న సమయంలో ఆమె అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. గత వారం రోజులుగా అసెంబ్లీ సమావేశాలు, వరుస కార్యక్రమాలతో హోంమంత్రి తీరిక లేకుండా గడుపుతున్నారు. నిరంతర పని ఒత్తిడి, సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఆమె నీరసించిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. హోంమంత్రి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె వ్యక్తిగత సిబ్బంది స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచించినట్లు సమాచారం.

## రాజీనామా చేయనున్న బీహార్ సీఎం నీతీశ్?

**బీహార్:** 'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి ఎంతో మద్దతిచ్చారు. అంకితభావంతో నా నేను విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితం ప్రారంభించినప్పటి నుంచి నా మనసులో ఓ కోరిక ఉంది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలతో పాటు పార్లమెంట్‌లోని ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలి అనుకుంటు న్నాను. నూతన బాధ్యతలు చేపట్టాక కూడా బిహార్‌తో నా బంధం ఇలాగే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు నితీశ్ కుమార్. నితీశ్ తాజా ప్రకటనతో.. బిహార్‌కు నూతన ముఖ్యమంత్రి ఎన్నిక అనివార్యం కానుంది.

## ఊబకాయం నివారణకు భారతీయ వంటకాలు బెస్ట్



**మధురవాడ, పతాకం న్యూస్:** స్థూలకాయాన్ని నివారించడానికి భారతీయ వంటకాలు ఉత్తమమైనవని, దానికి శారీరక వ్యాయామం తోడైతే ఈ సమస్యను దూరం చేసుకోవచ్చునని పలువురు వైద్యనిపుణులు సూచించారు. ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భంగా గీతం ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వంటకాల స్థానంలో వచ్చిన ఫాస్ట్‌ఫుడ్, ఇతర ఆహర అలవాట్లలో వచ్చిన మార్పులు శరీర బరువు పెరగడానికి కారణమన్నారు. గడచిన రెండు దశాబ్ధాలలో ఆహర పిరమిడ్‌లో సమతుల్యత దెబ్బతిందని, ప్రజల శరీరంలో తగిన పోషకాలు, విటమిన్‌లు లోపించడంతో ప్రత్యామ్నాయంగా మందులు వాడే పరిస్థితి ఏర్పడిందన్నారు జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.గౌతమ్ మాట్లాడుతూ మధుమేహం, హృద్రోగ సమస్యలతో పాటు వివిధ రుగ్మతలకు ఊబకాయం ఒక కారణమన్నారు. ఊబకాయం మానవ ఉత్పాదక సామర్థ్యాన్ని తగ్గిస్తోందన్నారు. గీతం ఆసుపత్రి సీనియర్ డైటీషియన్ కె.సూర్యదీప్తి మాట్లాడుతూ శరీర తత్వానికి అనుగుణంగా పోషక విలువలతో కూడిన ఆహరం తీసుకోవాలని, క్రమం తప్పక శారీరక వ్యాయామంతో శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చునని సూచించారు. గీతం ఆసుపత్రి సైక్రియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఫిట్‌నెస్ కోచ్ ఫర్జానా బేగం ఊబకాయం నివారణకు జాగ్రత్తలను వివరించారు.. కార్యక్రమంలో గీతం వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జితేంద్ర, గీతం వైద్య కళాశాల న్యూట్రిషన్ మరియు డైటేషన్ విభాగం అధిపతి డాక్టర్ పి.మానస, ఎమ్.తేజస్వి, సీనియర్ డాక్టర్‌లు, వైద్య విద్యార్ధులు పాల్గొన్నారు.

## ప్రకృతి సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో రైతులు ప్రకృతి సాగువైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. తక్కువ శ్రమతో అధిక దిగుబడి, రాబడినిచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఏ నేలకు ఏ పంట అనువైనదో శాస్త్రవేత్తలు వివరించాలన్నారు. విత్తనం నాటినప్పటి నుంచి పంట విక్రయం వరకు రైతులకు భరోసా కల్పించాలని సూచించారు. కోళ్ల పెంపకం ద్వారా వ్యవసాయేతర కుటుంబాల ఆదాయం పెంచాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా నిరుద్యోగులను గుర్తించి కొత్త యూనిట్లు స్థాపనలో వారికి తోడ్పాటు అందించాలని ఆదేశించారు. పాడి రైతులు కేవలం పాలు అమ్మడమే కాకుండా పన్నీరు వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. దోమల నివారణకు గంభూషియా చేపలను నీటి నిల్వల్లో విడిచిపెట్టాలన్నారు. సీతానగరం మండలంలోని కోట సీతారాంపురం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డీపీవో టి.కొండలరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. మార్ట్ ప్రాజెక్టు.. జిల్లా ప్రగతికి సరికొత్త బాట వేయనుందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. దీనికి సంబంధించి ప్రతి శాఖాధికారి చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికలతో రైతులు, మహిళల ఆదాయం రెట్టింపు కావాలని తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ.. మహిళలు కేవలం గృహిణులుగా కాకుండా చిన్న తరహా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మార్ట్ ఒక వేదిక కావాలన్నారు. రైతులు తమ పంటను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకునేలా మార్కెట్ లింకేజ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు క్రాప్ డైవర్ఫికేషన్ వైపు మళ్లాలని సూచిం చారు. వాణిజ్య, ఉద్యాన పంటలను ప్రోత్సహించి.. రైతుల తలసరి ఆదాయం పెంచడమే మార్ట్ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు.

## రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** 2026 రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ గురువారం అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆమోదించినట్లు పార్టీ వెల్లడించింది. పార్టీ ప్రకటన ప్రకారం ఫూలో దేవి నేతం (ఛత్తీస్‌గఢ్), కరంవీర్ సింగ్ బౌధ్ (హర్యానా), అనురాగ్ శర్మ (హిమాచల్ ప్రదేశ్), ఎం. క్రిస్టోఫర్ తిలక్ (తమిళనాడు), మరియు అభిషేక్ మను సింఘ్వి మరియు వేం నరేందర్ రెడ్డి (తెలంగాణ) లకు అవకాశం ఇచ్చింది. అలాగే తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వి మరియు వేం నరేందర్ రెడ్డిలను పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించింది. తనపై నమ్మకం ఉంచిన కాంగ్రెస్ అధిష్టానానికి నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎఐసిసి జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించారు. రాజ్యసభకు 10 రాష్ట్రాల్లో ఖాళీ కానున్న 37 స్థానాల కోసం జరిగే ద్వైవార్షిక ఎన్నికలకు మార్చి 16న పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ విడుదలైంది.

## ఘనంగా అర్జున్ టెండూల్కర్ వివాహం.. హాజరైన లోకేశ్ దంపతులు



**ముంబై:** ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహం గురువారం ముంబయిలో ఘనంగా జరిగింది. ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు, తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అర్జున్ వివాహం చేసుకున్నారు. సానియా చందోక్ మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నిర్వహిస్తున్నారు.ఐసీసీ ఛైర్మన్ జైషా,టీమ్ఇండియా మాజీ క్రికెటర్లు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, తన అర్ధాంగి నారా బ్రహ్మణితో కలిసి ముంబైలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్ వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు హాజరవడంపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహ రిసెప్షన్ కోసం ముంబైలో ఉండటం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుకల్లో బ్రహ్మణితో కలిసి పాల్గొని, ముఖేశ్ అంబానీ , ఐసీసీ ఛైర్మన్ జై షా, ఇతర మిత్రులను కలవడం సంతోషాన్నిచ్చింది" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్జున్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. "అర్జున్‌కు జీవితాంతం సంతోషం, విజయం చేకూరాలని, క్రికెట్‌లో మరెన్నో చిరస్మరణీయ విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను," అంటూ ఆయన ఆకాంక్షించారు. లోకేశ్ దంపతులు వధూవరులతో కలిసి దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం.. రైతన్నల జీవితాలు మారుస్తాం: సీఎం చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి నేటికి 30 ఏళ్లు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కీలక ప్రకటన చేశారు. 30 ఏళ్ల క్రితం 1996 మార్చి 5న తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేసిన రోజును గుర్తుచేస్తూ.. ఇప్పుడు పనులను పూర్తి చేసి నీటిని అందించే అవకాశం తనకే వచ్చిందని సీఎం పేర్కొన్నారు. 1996 మార్చి 5.... ఆ రోజు తనకు ఇంకా గుర్తుందన్నారు సీఎం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతాల్లో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే.. వారి కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం తొలి అడుగు వేశామని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో.. జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని వినియోగించుకునే ఆలోచనతో 30 ఏళ్ల క్రితం ఇదే రోజున (1996 మార్చి 5న) ముఖ్యమంత్రిగా తాను వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. అనేక కారణాలతో తరువాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలైన వెలిగొండ పనులను మళ్లీ 2014-19 మధ్య వేగవంతం చేశామన్నారు సీఎం. ప్రాజెక్ట్ కోసం రూ.1,414 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. అయితే తరువాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం పేరుతో ప్రజలను మోసం చేసి నవ్వులపాలు అయ్యిందని సీఎం అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. రూ.140 కోట్లతో పెండింగ్ బిల్లులు క్లియర్ చేశామని, రూ.585 కోట్లు నిర్మాణంపై ఖర్చు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని అన్నారు .రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది జులై నాటికి తొలి ఫేజ్ పనులు పూర్తి చేసి వెలిగొండకు కృష్ణా నీళ్లు తీసుకొస్తామని స్పష్టం చేశారు. 2027-28 నాటికి ఫేజ్-2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. దశాబ్దాల కలను నిజం చేసి, కరువు ప్రాంతంలో ప్రతీ ఎకరానికి నీళ్లిచ్చి రైతన్న జీవితాలు మారుస్తామని.. హార్టికల్చర్ సాగుతో జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. 'వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే' అని సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

## పాత నేరస్తులపై నిఘా పెట్టాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పాత నేరస్తులపై నిఘా పెట్టడంతో పాటు వారికి కౌన్సెలింగ్ తప్పనిసరిగా ఇవ్వాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నెలవారీ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, కోర్టు వ్యవహారాలు, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ల అమలు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 'హిస్టరీ షీటర్ల కదిలికలపై నిఘా కొనసాగించాలి. ప్రజల వినతులను చట్టపరంగా, సమయపాలనతో పరిష్కరించాలి. దీర్ఘకాల పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలి. స్మార్ట్ పోలీసింగ్, నూతన క్రిమినల్ చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ప్రతి అధికారీ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. కోర్టు వ్యవహారాల్లో నిర్లక్ష్యం చేయవద్దు. నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ల అమలు, చార్జ్‌షీట్లు దాఖలు తదితర కోర్టు సంబంధిత అంశాల్లో సమయపాలనతో వ్యవహరించాలి. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు బలోపేతం చేయాలి. రాత్రి గస్తీ, బీట్‌లో అప్రమత్తంగా ఉండాలి. డయల్ 112 కాల్స్‌కు తక్షణం స్పందించాలి. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి అధికారీ బాధ్యతాయుతంగా పని చేయాలి.'అని ఎస్పీ ఆదేశించారు.

## గిరిజన చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలి



**సీతంపేట, పతాకం న్యూస్:** గిరిజన చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. స్థానిక ఐటిడిఎ పిఒ పిఒ ఛాంబర్‌లో గిరిజన సంఘాల ప్రతినిధులు నాయకులతో ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన చట్టాలైన 1/70, పీసా వంటి అమలు చేయాలన్నారు. సామాజిక భవనం గిరిజన సంఘాల సమావేశాలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఆదివాసి జెఎసి నాయకులు బిడ్డిక శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన భవనానికి స్థలం కేటాయించాలని అనేక సార్లు వినతులు సమర్పించామన్నారు. సోమవారం వారపు సంతలో హోటళ్ల తనిఖీలు చేపట్టాలన్నారు. ఎల్‌టిఆర్ కేసులు పరిశీలించాలన్నారు. జెఎసి నాయకులు బిడ్డిక ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కోదుల వీరఘట్టం, దాసు గుమ్మడ, అంబులగండి మీదుగా రహదారిపై మెటల్ వేసి వదిలేశారని, ఆ రహదారి పూర్తి చేయాలని కోరారు. ఎస్‌టియు యూనియన్ నాయకులు పాలక పురుషోత్తం మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాలో మెగా డిఎస్‌సిలో గిరిజనులకు అన్యాయం జరిగిందన్నారు. ట్రైబల్ వెల్ఫే సంఘం నాయకులు ఎం.రవి మాట్లాడుతూ బోగస్ ఎస్‌టి సర్టిఫికెట్ కేసులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు కళాశాలలుగా అప్గ్రేడ్ చేయాలని కోరారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నెట్వర్క్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, తాగునీరు పరిష్కరించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా సంఘం నాయకులు పలు సమస్యలపై ప్రస్తావించారు. ఆహ్వానం అందలేదుగిరిజన సంఘం ప్రతినిధులతో పిఒ సమావేశానికి తమకు ఎటువంటి ఆహ్వానం అందలేదని గిరిజన సంఘం నాయకులు ఎ.మన్మధరావు, కె.సుబ్బారావు, బి.సూర్యారావు కె.కాంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అనుచితమైన చర్య అని అన్నారు. సమావేశం పెడితే కొద్దిరోజులు ముందే సమాచారమివ్వాలన్నారు.

## దొంగల నుంచి 470 గ్రాముల బంగారం స్వాధీనం

**థార్ ముఠాతో తస్మా జాగ్రత్త.. పెద్ద మొత్తంలో బంగారాలను ఇళ్లల్లో ఉంచవద్దు**

**ఊరు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వండి..**

**మిగతా దొంగలను త్వరలోనే పట్టుకుంటాం .. డిప్యూటీ ఎస్పీ స్వామిలత**




**విజయనగరం, పతాకం న్యూస్:** ఫిబ్రవరి 2వ తారీఖున జరిగిన దొంగతనంలో 1523 గ్రాముల బంగారం దొంగతనం జరిగినట్లు జిల్లా డిప్యూటీ ఎస్పీ స్వామిలత సమావేశంలో తెలిపారు. గురువారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన రాజాం జిఎంఆర్ ఐటి కాలనీలో దొంగతనం జరిగినట్లు బాధితులు డాక్టర్ నాగేష్ దసర్వాల్, గడ్డం మాధవ కృష్ణారెడ్డి ప్రొఫెసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ సమక్షంలో తమ టీంతో వెళ్లి పరిశీలించగా, పరిశీలనలో మధ్యప్రదేశ్ తార్ జిల్లాకు చెందిన దొంగలుగా గుర్తించడం జరిగిందన్నారు. పోలీస్ బృందాలు నాలుగు ఏర్పడి ఆ రాష్ట్రం వెళ్లి వారికోసం వెతకగా వారు తిరిగి మన ప్రదేశానికి వచ్చినట్లు సమాచారం రావడంతో ఈరోజు ఉదయం వారిని అదే ప్రాంతంలో బూరాడ గ్రామ జంక్షన్లో ఇద్దరు దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 470 గ్రాములు బంగారాన్ని స్వాధీనం పరుచుకున్నట్లు తెలిపారు. ఈ దొంగతనంలో మొత్తం నలుగురు ఉన్నారన్నారు. మిగతా ఇద్దరిని త్వరలో పట్టుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా రికవరీలో 1053 గ్రాములు రికవరీ చేయవలసి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులు ఎవరైనా జిల్లాలో మండలంలోని ఎక్కడైనా ఇంటికి తాళాలు వేసి ఊర్లకు వెళ్లాలంటే పిల్లల్లో ఎక్కువ మొత్తంలో బంగారాలను ఇంట్లో పెట్టుకుని వెళ్లకూడదన్నారు. ఒకవేళ అలా వెళ్ళాల్సి వస్తే పోలీసులకు సమాచారం ఇస్తే అక్కడ నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా బ్యాంక్ లాకర్లో పెట్టుకోవాలని సలహాలు ఇచ్చారు. దీంతో పాటు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లయితే దొంగతనాలకు ఆస్కారం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు ఉపేంద్ర, రాఘవులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా తాగునీటి వ్యవస్థ!



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దశాబ్దాల కిందట నాటి పైపులైన్లు, తాగునీటి పథకాలు కావడంతో తరచూ మొరాయిస్తున్నాయి. మురుగు కాలువల్లో పైపులైన్లు ఉంటున్నాయి. వీటి లీకేజీలతో ఒక్కోసారి తాగునీరు కలుషితం అవుతోంది. దీనికితోడు పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పనులు సక్రమంగా జరగడం లేదు. కాలువలు, రోడ్లు అన్నీ చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయి. ఇటీవల శ్రీకాకుళం కార్పొరేషన్‌లో తాగునీరు కలుషితం కావడంతో డయేరియా ప్రబలింది. అటువంటి పరిస్థితి పట్టణంలో తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్ఛాపురంలో 21 వార్డులు ఉన్నాయి. 20 ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో 28 వేల మంది జనాభాకు తగ్గట్టుగా వీటిని వేశారు. కానీ ఇప్పుడు పట్టణంతో పాటు జనాభా పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 36 వేల మంది జనాభా అని చెబుతున్నా.. ఆ సంఖ్య 50 వేలకుపైగా పెరిగినట్టు తెలుస్తోంది. అందుకు తగ్గట్టు నీటి సరఫరా లేకుండా పోతోంది. పట్టణ జనాభాకు రోజుకు సగటున 5.10 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం అందులో సగం నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. 1,2,3 వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పలు ప్రాంతాల్లో భూ మట్టానికి మూడు నుంచి ఐదు అడుగుల గోతులో ఉన్న కుళాయి నుంచి ప్రజలు నీటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో 15 బోర్లు పనిచేయడం లేదని అధికారికవర్గాలు చెబుతున్నాయి. కానీ అంతకు మించి బోర్లు మూలకు చేరాయని తెలుస్తోంది. ముఖ్యంగా రత్తకన్న పరిధిలో చాలా వీధులకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఉద్దానం ప్రాజెక్టులో భాగంగా బాహుదా నదిలో ఊటబావులు ఏర్పాటుచేశారు. వాటి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. క్లోరినేషన్ చేపట్టిన తరువాత రాజావారితోటలో రిజర్వాయర్ ద్వారా పట్టణ అవసరాల కోసం 8 లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ విడిచిపెడుతున్నారు. అయితే ఈ నీరు ప్రజల అవసరాలకు ఏ మూలకు సరిపోవడం లేదు. రూ.54.48 కోట్ల కేంద్ర నిధులతో చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. అది పూర్తయితే కానీ.. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే అవకాశం లేదు. 1,2,3 వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు ఏర్పాటుచేసిన పైపులైన్లు లీకులయ్యాయి. ట్రయల్ రన్ వేసి వదిలేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారు. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న ట్యాంకర్‌ను నిర్మించి వృథాగా వదిలేశారు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంలో ఇచ్ఛాపురం మునిసిపాల్టీకి చోటిచ్చారు.

కానీ..ఇంతవరకూ నీటిని అందించలేదు. దశాబ్దాల కిందట వేసిన పైపులైన్లు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే మురుగునీటి కాలువల గుండా పైపులైన్లు వేశారు. దీంతో తరచూ అవి పగిలిపోయి వ్యర్థాలు కలిసిపోతున్నాయి.

పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాలకే పారిశుధ్య పనులు పరిమితం అవుతున్నాయి. ప్రస్తుతం మునిసిపాల్టీలో 98 మంది వరకూ పారిశుధ్య కార్మికులు ఉండగా, అందులో కేవలం 8మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు, మిగతా వారంతా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది. ఇందులో రెగ్యులర్ కార్మికులు ఓ ఐదుగురు మాత్రమే ఉన్నారు. ప్రధాన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. రోడ్లపై చెత్తను శుభ్రం చేసి తరలిస్తున్నారు. కానీ, మురుగు కాలువల్లో చెత్త తొలగించడం లేదు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

## డాక్టర్లు, సిబ్బంది డ్యూటీ చార్టులు ఇవ్వండి



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, ఎస్‌హెచ్‌ఎ, డాక్టర్ వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌తో తన ఛాంబర్‌లో కలెక్టర్ సమీక్షించారు. జిజిహెచ్‌పై అనేక ఫిర్యాదులు వస్తున్నందున ఫిబ్రవరి 27న రాత్రి తాను ఆకస్మిక తనిఖీ చేయగా పలు అంశాలు తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఆసమయంలో డ్యూటీలో లేని డాక్టర్లను వివరణ కోరుతూ మెమోలు జారీ చేయాలని, నైట్ షిఫ్ట్‌లలో విధులు నిర్వహించే వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలు ఒక వారం రోజుల డ్యూటీ చార్టును అందించాలని ఆదేశించారు. ఇవే వివరాలు ఆసుపత్రిలోను ప్రదర్శించాలన్నారు. వివిధ అంశాలపై కలెక్టర్‌కు సూపరింటెండెంట్ వివరాలు చెప్పారు. క్యాజువాలిటి మెడికల్ ఆఫీసర్ (సిఎంఒ) రోజుకు ఒకరు విధుల్లో ఉంటారని, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఒ) ఆసుపత్రి క్వాటర్స్‌లో ఉండి విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఆసుపత్రిలో 338 మంది పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారని, బయోమెట్రిక్ వ్యర్థాలు, సాధారణ వ్యర్థాలను మూడు రకాల బ్యాగుల్లో సేకరించి ప్లాంట్‌లకు పంపుతారని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల నుండి చివరి నిముషంలో రోగులను జిజిహెచ్‌కు ఎతస్తున్నారని అన్నారు. రోజుకు 20–30 మరణాలు సంభవిస్తున్నాయని, మహాప్రస్థానం వాహనాలు సరిపోవడం లేదని తెలిపారు. ఖాళిపోస్టుల వివరాలను చెప్పి వాటిని భర్తీ చేయాలని కోరగా అందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. సమీక్షలో డిప్యూటీ కలెక్టర్ సిహెచ్.సుధారాణి, ఆస్పత్రి అధికారులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు వసూలు చేయాలి



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** సకాలంలో పన్ను వసూళ్లు పూర్తి చేయాలని.. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్య ధోరణి కనిపిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ సిబ్బందిని కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో బుధవారం అధికారులు, సచివాలయ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, నీటి ఛార్జీలు, ఇతర పన్ను బకాయిల వసూళ్లపై ఆరా తీశారు. ఆర్థిక సంవత్సరం నెలాఖరుతో ముగుస్తున్నందున.. పన్ను వసూళ్లలో ఒక స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. ప్రతి వార్డులో బకాయిల జాబితాను స్పష్టంగా తయారు చేసి, వచ్చే వారం రోజుల్లో ఎంత వసూలు చేయగలమో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఏడాదీ నిర్ణీత సమయంలో ఆస్తి పన్నులు చెల్లించాల్సి ఉండగా, కొందరు గడువు దాటినా చెల్లించడం లేదని.. అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. మరికొందరు మొండి బకాయిదారులు సమయం మించిపోతున్నా ఇంకా చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై రెట్టింపు దృష్టి పెట్టి, అవసరమైన చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని సూచించారు. వచ్చే వారం రోజులు ప్రత్యేక వసూళ్ల దినాలుగా పాటించి, లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ఎన్ని నోటీసులు జారీ చేశారో, ఎంత మొత్తం వసూలు చేశారో వివరాలతో సమర్పించాలని ఆదేశించారు. నగరాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదలకు పన్ను వసూళ్లు ఎంతో కీలకమని, ప్రజల సహకారంతో రాజమహేంద్రవరంను ఆర్థికంగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవెన్యూ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్, ఎమినిటీస్ సెక్రటరీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశాల నినాదాలతో దద్దరిల్లిన ధర్నా చౌక్




**విజయవాడ, పతాకం న్యూస్:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్ల 'ఛలో విజయవాడ' కార్యక్రమం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ప్రారంభమైంది. విజయవాడకు చేరుకోకుండా అనేక చోట్ల ఆశాలను అడ్డుకున్నప్పటికీ వెనుకడుగు వేయకుండా చలో విజయవాడ కార్యక్రమానికి ఆశా వర్కర్లు భారీగా తరలివచ్చారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు కల్పించాలని, ప్రభుత్వమే ఆశాలను నియమించాలని, నాణ్యమైన మొబైల్ ఫోన్లు, యూనిఫోమ్స్ ఇవ్వాలని, పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, రూ.10 గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని, తదితర నినాదాలతో ధర్నా చౌక్ దద్దరిల్లింది.

## డోన్ పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే కోట్ల

**డోన్, పతాకం న్యూస్:** డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి గురువారం డోన్ పట్టణంలో పర్యటించారు. పలు ఫంక్షన్ హాళ్లలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై సందడి చేశారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ, శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే, నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం కన్వెన్షన్ హాల్ నందు జరిగిన వేడుకలో పాల్గొని, వధూవరులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# దళారుల మాయాజాలంతో నష్టపోతున్న కొబ్బరి రైతులు



**రాజోలు, పతాకం న్యూస్:** సాధారణంగా పంట ఉత్పత్తుల ధర పెరిగితే దాన్ని పండించే రైతులకు లాభాలు వస్తాయి. తద్వారా ఆదాయం పెరిగి కొంత వెనుక వేసుకునే అవకాశం ఉంటుంది. కానీ కొబ్బరి రైతుల పరిస్థితి మరోలా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొబ్బరి కాయలకు గిట్టుబాటు ధర బాగుంది. కానీ దళారులు, వ్యాపారులు కుమ్మక్కవ్వడం, దిగుబడి తగ్గిపోవడంతో వారికి పెరిగిన మేరకు ఆదాయం రావడం లేదు. కొబ్బరి కాయలకు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర ఉన్నా.. దళారులు, వ్యాపారస్తులు కలిసి ధరలను తగ్గించి రైతులకు దక్కకుండా చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వెయ్యి కొబ్బరి కాయలు నాణ్యతను బట్టి రూ.19 వేల నుంచి రూ.21 వేలు పలుకుతున్నాయి. అయితే దింపు ఖర్చు, మోత, ఒలుపు, రవాణా అంటూ కొందరు రైతులను దోచుకుంటున్నారు. రైతులు వచ్చిందే మంచి ధర అని సరిపెట్టుకుంటున్నారు. గత మూడు నెలలుగా అంతంత మాత్రంగా ఉన్న కొబ్బరి ధర నేడు పండగలు సీజన్ ప్రారంభం, శుభ ముహూర్తాలు రావడం, దిగుబడి తగ్గడం తదితర కారణాలతో అమాంతం కొబ్బరి కాయ ధర పెరిగింది. అయితే వ్యాపారులు నేరుగా తోట వద్దకే వచ్చి కొబ్బరి దింపు, మోత, రవాణా, ఒలుపు వంటివి అన్ని తామే చూసుకునేలా ఒప్పందం చేసుకుంటున్నారు. దానికి అంగీకరించిన రైతులకు రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. అదే రైతు దింపు తీసి ఒక్క చోట గుట్టగా పెట్టితే కాయల నాణ్యతను బట్టి రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకూ చెల్లిస్తున్నారు.అధిక సాగు జిల్లాలోనేకొబ్బరి అనగానే కోనసీమ గుర్తుకు వస్తుంది. రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా, సుమారు 93 వేల ఎకరాలకు పైగా కోనసీమలోనే ఉంది. 70 వేల మందికిపైగా రైతులు కొబ్బరి సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. దీర్ఘకాలిక ఉద్యాన పంటల్లో ఒకటిగా...నెలనెలా క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందించే పంటగా పేరొందింది. కొబ్బరి నుంచి సుమారు 160 రకాలకు పైగా ఉత్పత్తులను తయారు చేసే అవకాశముంది. రైతులే కాకుండా దింపు, వలుపు, తరుగు కార్మికులుగా, మోత, రవాణా కూలీలుగా వేలాది మంది జీవిస్తున్నారు. జిల్లాలో సుమారు ఐదు వేల మంది వరకు నేరుగా ఉపాధి పొందుతున్నారు. క్వాయర్ ఉత్పత్తి పరిశ్రమల ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి పొందుతుండగా, కూలీలుగానే కాకుండా పీచుతో కళాత్మక ఉత్పత్తుల తయారీతో మహిళలు జీవనం సాగిస్తున్నారు. దళారీలు, వ్యాపారస్తులు కుమ్మక్కవ్వటంతో పెరిగిన ధరను రైతులకు ఇవ్వడం లేదు. ఎక్కడికు వెళ్లినా అదే రేటు చెప్పడంతో రైతులు చేసేది లేక అయిన కాడికి అమ్ముకుంటున్నారు. తగ్గిన దిగుబడులు...పెరిగిన ధరగతంలో ఒక ఎకరం కొబ్బరి తోట నుంచి సుమారు 1200 నుంచి 1400 కాయల దిగుబడి వచ్చేది. కానీ నేడు 600 నుంచి 700 కాయలు మాత్రమే దిగుబడి వస్తోంది. గతంలో వేసవిలో కాయలు తయారైనా, అవ్వకపోయినా నీళ్లు ఆడేవని దీనితో దిగుబడి వచ్చేదని రైతులు చెబుతున్నారు. నేడు శీతల గాలులు, చలి ఎక్కువగా ఉండటంతో కాయ తయారు కావడం ఆలస్యమవుతోందన్నారు. కొబ్బరికి మార్కెట్‌లో ధర పెరగటానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా మన రాష్ట్రంతో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో దిగుబడులు అనూహ్యంగా తగ్గిపోవటంతో ఇక్కడి కొబ్బరికి డిమాండ్ పెరిగింది. అదే సమయంలో పండగలు, శుభ ముహూర్తాలు ఉండటం, దిగుబడి తగ్గటంతో ధరలు పెరిగాయి. ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయి. అందుకే మన కొబ్బరికి డిమాండ్ వచ్చిందని వ్యాపారస్తులు చెబుతున్నారు.తగ్గిన ఎగుమతులుమూడు నెలల క్రితం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిత్యం 400 నుంచి 500 లారీల్లో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరిగేవి. నేడు 150 లారీలకు మించి వెళ్లడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కొబ్బరి ధరను పెంచేది, తగ్గించేది ఉమ్మడి గోదావరి జిల్లాలో ప్రధానమైన అంబాజీపేట, పాలకొల్లు మార్కెట్లే. చిరు వ్యాపారస్తులందరూ ఈ మార్కెట్లలో నిర్ణయించిన ధరలు ప్రకారమే రైతులకు చెల్లిస్తారు. ఇదేమిటని అడిగితే ఇష్టం ఉంటే ఇవ్వండి లేకపోతే లేదు అంటున్నారని రైతులు వాపోతున్నారు. కొబ్బరికి డిమాండ్ ఉన్నా రైతుకు మాత్రం కలసి రావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శక్తి టీం బృందాలచే అవగాహన కార్యక్రమం

**నంద్యాల, పతాకం న్యూస్:** నంద్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం అన్నీ స్కూళ్లలో, కాలేజీల్లో మహిళలపై నేరాలు , బాల్య వివాహాల నిరోధం, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్ పై నియంత్రణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి సూచనలతో నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది జిల్లా పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గల చిన్మయ మిషన్ విద్యాలయ హై స్కూల్ నందు విద్యార్థినిలకు శక్తి యాప్ గురించి, వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి సవివరంగా వివరించారు. మీ తల్లిదండ్రులకు శక్తి యాప్ గురించి తెలియజేసి వారి సెల్ ఫోన్ లలో రిజిస్టేషన్ చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ప్రస్తుతం సమాజంలో జరిగే సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరించి ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మహిళలు,చిన్నపిల్లలపై జరిగే నేరాలగురించి అవగాహన కల్పించి వాటికి సంబందించిన టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి వివరించారు. ఆపద సమయంలో అమ్మాయిలు శక్తి యాప్ నంబర్ 7993485111 కు ఫోన్ చేసినచో తక్షణమే స్పందిస్తామని శక్తి టీం బృందాలు తెలిపారు. నంద్యాల జిల్లాలో గల వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి శక్తి టీముల పనితీరును వివరించడంతో పాటు అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన 112/100 గురించి తెలిపారు. మీరు బాధ్యతగల పౌరులుగా ఎదగాలని, విద్యతో పాటు మంచి నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం కలవారని, ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

## నిర్బంధాలు కాదు.. వేతనాలు పెంచండి..



**పల్నాడు, పతాకం న్యూస్:** అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో అంగన్వాడీల ఉద్యమాన్ని ఆపలేరని, చలి చీమలు లాంటి అంగన్వాడీల శక్తిని టిడిపి కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో దీక్ష చేస్తున్న అంగన్వాడీల అక్రమ అరెస్టును ఖండిస్తూ నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ -- హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారన్నారు. కనీస వేతనం, అర్హులకు ప్రమోషన్లు, ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని విజయవాడలో 36 గంటల నిరసన దీక్ష చేపట్టారని చెప్పారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు చర్యలు చేపట్టడం మానేసి నిర్బంధానికి పూనుకుందని, దీక్ష శిబిరంలోని వారిని పోలీసులు తెల్లవారుజామున అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పద్ధతి మార్చుకోవాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీఓలిచ్చి వేతనాలను పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 10వ తేదీనుండి అంగన్వాడీలు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరిం చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ పల్నాడు జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిలార్ మసూద్, అంగన్వాడి నరసరావుపేట ప్రాజెక్టు కార్యదర్శి బి.నిర్మల, జిల్లా కోశాధికారి డి.మాధవి, సాయికుమారి, శోభ, అచ్యుత, రాజకుమారి, లక్ష్మి, స్రవంతి, షహనాజ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

**ముమ్మిడివరం, పతాకం న్యూస్:** ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అమలాపురం డివిజన్ ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తులిప్స్ రమేష్ డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఆపిల్ స్కూల్ నందు గురువారం డివిజన్ అధ్యక్షుడు పి.లక్ష్మీ శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పేద విద్యార్థులకు విద్య హక్కు చట్టం 12(1)సి ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో సీట్లు కేటాయించి, ఉచితంగా విద్య నందిస్తున్నప్పటికి ప్రభుత్వం రావలసిన ఫీజులు మంజూరు కాక ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. వెంటనే బకాయి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తక్కువ ధరతో నష్టపోతున్న శనగరైతు



**గుంటూరు, పతాకం న్యూస్:** శనగల కొనుగోలు వేగవంతం చేయాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనగలకు మద్దతు ధర రూ.5,875గా ప్రభుత్వం ప్రకటించినా ప్రైవేటు వ్యాపారస్తులు రూ.4,800 నుండి రూ.5 వేల మధ్యనే కొంటున్నారని, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు తెరిచామని ప్రభుత్వం చెబుతున్నా, కొనుగోలు జరపకపోవడంతో రైతులు తక్కువ ధరకే అమ్ముకుని నష్టపోతున్నారని అన్నారు. ఎకరా శనగ సాకుగు రూ.40 వేల వరకూ ఖర్చవుతోందని, సగటున దిగుబడి 8 క్వింటాళ్లు వస్తోందని, ప్రభుత్వ మద్దతు ధరకు కొంటే రైతులకు పెట్టుబడి ఖర్చులైనా వస్తాయని అన్నారు. తేమశాతం వంటి ఇతర నిబంధనలను సడలించి రైతుల వద్ద నుంచి మొత్తం శనగలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో మొక్కజొన్న పంట చేతికి వస్తుందని రూ.2,400 మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే ఉచితంగా అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, పంట రుణాలు మంజూరుతోపాటు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు. సమావేశంలో రైతుసంఘం మండల కార్యదర్శి కె.వెంకటశివరావు, నాయకులు జె.రామారావు, ఎన్.రాజేంద్ర, డి.రమేష్‌బాబు, పి.భువనేశ్వరి, ఎం.లక్ష్మి, షేక్ షమీ పాల్గొన్నారు.

## ప్రజల కనీస అవసరాలు ప్రభుత్వాలు తీర్చాలి

**అల్లంపురం, పతాకం న్యూస్:** ప్రజల కనీస అవసరాలు తీర్చలేని ప్రభుత్వాలు గద్దె దిగాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర ఎనిమిదో రోజు అల్లంపురం గ్రామానికి చేరుకున్న సందర్భంగా కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున అపూర్వ స్వాగతం పలికారు. పాదయాత్ర బృందానికి హారతులు, పూలతో, పచ్చ కండువాలు తో అభినందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి. గోపాలన్ మాట్లాడుతూ అల్లంపురం గ్రామంలో త్రాగునీరు సమస్య ఎక్కువగా ఉందన్నారు. పరిశుభ్రమైన త్రాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని ఆయన అన్నారు.

## పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు




**పిఠాపురం, పతాకం న్యూస్:** ఈ నెల 16 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆర్‌జెడి జి.నాగమణి, డిఇఒ పి.రమేష్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వాహణాధికారులు, ఎంఇఒలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. డివైఇఒ ప్రభాకర శర్మ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఆర్‌జెడి జి.నాగమణి, డిఇఒ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఫర్నిచర్, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. టైమ్ టేబుల్ ప్రకారం ఆయా కేంద్రాలకు వాటిని సరఫరా చేసి, పరీక్షలను అత్యంత పారదర్శకంగా జరిపించాలన్నారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ బోర్డు సెక్రటరీ ఎం.వెంకట్రావు, పరీక్షా విభాగం అసిస్టెంట్ కమిషనర్ రమణి వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పెద్దాపురం డివిజన్ పరిధిలోని ఎంఇఒలు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేట్లపాలెం బాధితులకు ఆర్థిక సాయం

**సామర్లకోట, పతాకం న్యూస్:** వేట్లపాలెం బాణసంచా బాధిత కుటుంబాలకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో రూ.25,000 నగదు, 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. వేట్లపాలెం రైస్ మిల్లర్ అసోసియేషన్ భవనంలోనూ, సామర్లకోట బ్రౌన్ పేటలో బాధిత కుటుంబాలకు డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రంగనాగ్ ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. వేట్లపాలెం బాణసంచా ప్రమాదం సంఘటన జరగడం బాధాకరమని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించి హుటాహుటీనా ఇక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని అన్నారు. అయితే అప్పటికే పెద్దఎత్తున ప్రాణనష్టం, గాయాలు సంభవించాయని విచారం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని, అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు నున్న రామకృష్ణ, గుమ్మల్ల సత్యనారాయణ, సైరస్ శ్రీను, మట్టే శ్రీనివాస్, గుమ్మల్ల రామకృష్ణ , బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తపోటు ఉన్నవారు ఏ ఆహారాలను తీసుకోవాలి..!

రక్తపోటు ఉన్నవారు ఏయే ఆహారాలను తీసుకోవాలి.. వేటిని మానేయాలి..? మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది రక్తపోటు బారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ఈ సమస్య బారిన ఎక్కువగా పడుతున్నారు. ఒక్కసారి రక్తపోటు సంబంధిత మాత్రలు వాడడం మొదలు పెడితే వాటిని జీవితాంతం వాడాల్సిందే. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది రక్తపోటు బారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ఈ సమస్య బారిన ఎక్కువగా పడుతున్నారు. ఒక్కసారి రక్తపోటు సంబంధిత మాత్రలు వాడడం మొదలు పెడితే వాటిని జీవితాంతం వాడాల్సిందే. అలాగే రక్తపోటు గుండె జబ్బులు, స్ట్రోక్ లు వచ్చే అవకాశాలను పెంచుతుంది. కనుక రక్తపోటును అదుపులో ఉంచుకోవడంతో పాటు ఈ సమస్య బారిన పడకుండా ఎవరిని వారు కాపాడుకోవాలి. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల రక్తపోటును సులభంగా తిప్పికొట్టవచ్చు. అలాగే ఈ మార్పులు రక్తపోటు బారిన పడకుండా కాపాడడంలో కూడా ఎంతో సహాయపడతాయి. రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి జీవనశైలిలో చేసుకోదగిన మార్పుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. రోజూ 30 నుండి 40 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటు స్థాయిలు అదుపులో ఉండాలంటే శరీర బరువు అదుపులో ఉండడం కూడా చాలా ముఖ్యం. కనుక క్రాష్ డైట్స్ వంటి వాటితో కాకుండా ఆరోగ్యంగా బరువు తగ్గేలా చూసుకోవాలి. అలాగే చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం మానేయడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారాలను కూడా తీసుకోవడం తగ్గించాలి. దీని వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారు అరటిపండ్లు, చేపలు, పాలు, చిలగడదుంపలు వంటి పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇటువంటి ఆహారాలు రక్తపోటును తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. అయితే మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారు మాత్రం పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

అలాగే ఉప్పును తీసుకోవడం తగ్గించాలి. ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల కొందరిలో రక్తపోటు అదుపులో ఉంటుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటును పెంచుతాయి. కనుక వీటికి కూడా దూరంగా ఉండడం మంచిది. ధూమపానం కారణంగా కూడా రక్తపోటు పెరుగుతుంది. ధూమపానాన్ని మానేయడం వల్ల హృదయనాళ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తద్వారా రక్తపోటు స్థాయిలు అదుపులో ఉంటాయి. రక్తపోటుకు కారణాల్లో ఒత్తిడి కూడా ఒకటి. కనుక ఒత్తిడి దరి చేరకుండా చూసుకోవాలి. యోగా, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అలాగే డార్క్ చాక్లెట్ కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. డార్క్ చాక్లెట్ లో 60 శాతం కోకో ఉండేలా చూసుకోవాలి. గ్రీన్ టీ, సెలెరీ జ్యూస్ వంటివి కూడా రక్తపోటును తగ్గించడంలో దోహదపడతాయి. అల్లం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్న సంగతి తెలిసిందే. అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించడంతో పాటు రక్తపోటును తగ్గించడంలో కూడా అల్లం సహాయ పడుతుంది.

నిద్రలేమి కూడా రక్తపోటును పెంచుతుంది. కనుక రోజూ 6 నుండి 8 గంటల పాటు నాణ్యమైన నిద్ర పోయేలా చూసుకోవాలి. పచ్చి వెల్లుల్లిని లేదా వెల్లుల్లి పొడి తీసుకోవడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు గుడ్లు, గింజలు, శనగలు వంటి ఆహారాలు కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఆల్కహాల్ ను తీసుకోవడం మానేయడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. కూరగాయలు, పాల ఉత్పత్తులు, చిక్కుళ్లు, చికెన్, తృణ ధాన్యాలు వంటి ఆహారాలు మెగ్నీషియంను కలిగి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కూడా రక్తపోటును తగ్గించుకోవచ్చు. బెర్రీ జాతికి చెందిన పండ్లల్లో పాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉండడంతో పాటు హృదయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. తగిన ఆహారాలను తీసుకుంటూ, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవడంతో పాటు రక్తపోటు బారిన పడకుండా ఎవరిని వారు కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే ఈ చిట్కాలను పాటించినప్పటికి రక్తపోటు అదుపులో ఉండకపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు!

## కొరవడిన అధికారుల పర్యవేక్షణ



**విజయనగరం, పతాకం న్యూస్:** ఉపాధి హామీ నిధులతో జిల్లాలో పలుచోట్ల చేపడుతున్న అభివృద్ధి పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకులు అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు అనుమతులు ఇవ్వకుండానే పనులు చేపడుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పంచాయతీల పరిధిలో సచి వాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ కూడా కొరవడింది. దీంతో పనులను ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. జిల్లాలో బీటీ, సీసీ రహదారులకు సుమారు రూ.148 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే రూ. 70 కోట్లుకు పైగా వెచ్చించారు. గరుగుబిల్లి మండలంలో 149 పనులు నిర్వహిస్తున్నారు. కాగా గొట్టివలస పంచాయతీ పరిధిలో సీసీ రహదారితో పాటు డ్రైనేజీలకు రూ.4.90 లక్షలు కేటాయిం చారు. అయితే కేవలం సీసీ రహదారి పనులు చేపట్టి.. డ్రైనేజీలను మాత్రం నిర్మించలేదు. కురుపాం నియోజకవర్గం పరిధిలో 342 పనులకు జనవరి 31న కోట్లాది రూపాయల ఉపాధి నిధులు మంజూరు చేశారు. అగ్రిమెంట్, టెండర్లు లేకుండానే ఆయా పనులు చేపడు తున్నారు. ఇదే పరిస్థితి పలు పంచాయతీల్లో ఉంది. చాలాచోట్ల డ్రైనేజీలు లేకుండా సీసీ రహదారులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు లేకుండానే గ్రామస్థాయిలో ఆయా పనులు చేపడుతున్నారు. ఉపాధి హామీ నిధులతో పలు అభివృద్ధి పనులను చేపడుతుండగా... వాటి నిర్వహణకు సంబంధించిన రికార్డింగ్‌ను పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు అప్పగించారు.ప్రస్తుతం ఉపాధి హామీ పథకానికి సంబంధించి రాష్ట్రం వాటా 10 శాతం, కేంద్రం వాటా 90 శాతంగా ఉంది. కొద్దిరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నిబంధనలు మారనున్నాయి. దీని ప్రకారం.. రాష్ట్రం వాటా 40 శాతం, కేంద్రం వాటా 60 శాతంగా ఉండనుంది. దీంతో జిల్లాలో ఆదరా బాదరాగా ఉపాధి అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఈ నెల 10లోగా పనులు పూర్తి చేసి 15లోగా చెల్లింపులు చేసేందుకు ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో మండలాల వారీగా ఆయా వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కాగా సమయం తక్కువ ఉండడంతో పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. అయితే వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ లేకుంటే నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉంది. మొత్తంగా క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకుండా అధికారులు చెల్లింపులు చేస్తారో, నిబంధనల మేరకు వ్యవహరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# టీజీఎస్ఆర్టీసీకి 2000 కొత్త బస్సులు..

## మహాలక్ష్మి పథకం రద్దీకి చెక్




**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో బస్సు ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో భారీగా పెరిగిన రద్దీని తగ్గించేందుకు కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకోనుంది. ఈ మేరకు బస్సుల సరఫరా కోసం ఒలెక్ట్రా గ్రీన్‌టెక్-ఈవీ ట్రాన్స్, గ్రీన్‌సెల్ మొబిలిటీ సంస్థలను ఎంపిక చేస్తూ జారీ అయిన లెటర్ ఆఫ్ అవార్డు ఫైల్‌పై ఆర్టీసీ ఎండీ వీసీ నాగిరెడ్డి సంతకాలు చేశారు. దీంతో కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. ఎంపికైన సంస్థలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి, ఒప్పందాలు పూర్తి చేసుకున్న తర్వాత బస్సుల తయారీని ప్రారంభిస్తాయి. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తెలంగాణకు ఈ 2000 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేశారు. వీటిలో 1,025 లోఫ్లోర్ నాన్ ఏసీ బస్సులు, 60 లోఫ్లోర్ ఏసీ బస్సుల తయారీ టెండరును ఒలెక్ట్రా గ్రీన్‌టెక్-ఈవీ ట్రాన్స్ దక్కించుకుంది. మిగిలిన 915 స్టాండర్డ్ ఫ్లోర్ బస్సుల తయారీ బాధ్యతను గ్రీన్‌సెల్ మొబిలిటీ సంస్థకు అప్పగించారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా ఉన్నందున, అక్కడ స్టాండర్డ్ ఫ్లోర్ బస్సులు సౌకర్యవంతంగా ఉంటాయని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ బస్సుల సరఫరాలో ఒక సాంకేతిక అంశం కీలకంగా మారింది. ఈ ఏడాది అక్టోబరు 1 తర్వాత దేశంలోని నగరాల్లో తిరిగే బస్సులన్నీ తప్పనిసరిగా లోఫ్లోర్‌వే ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఈ నిబంధన 915 స్టాండర్డ్ ఫ్లోర్ బస్సుల తయారీపై ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో స్పష్టత కోరుతూ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. ఒకవేళ కేంద్రం స్టాండర్డ్ ఫ్లోర్‌కు అంగీకరించకపోతే, ఆ 915 బస్సులను కూడా లోఫ్లోర్‌గానే తయారు చేసి ఇవ్వాలని గ్రీన్‌సెల్ మొబిలిటీతో చేసుకున్న ఒప్పందంలో షరతు విధించినట్లు సమాచారం.




# ఫైనల్‌కు న్యూజిలాండ్




మ్యాచ్ రోజు ఎవరు బాగా ఆడితే వారిదే విజయమన్న నానుడిని న్యూజిలాండ్ నిరూపించింది. ప్రపంచ కప్ తొలి సెమీఫైనల్లో కివీస్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. దాంతో ఏకపక్ష మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. తొలుత సఫారీలు 20 ఓవర్లలో 169/8 స్కోరు చేశారు. యాన్సెన్ (30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55 నాటౌట్) బ్రెవిస్ (27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34) ఆదుకున్నారు. మెకాంచీ, రచిన్, హెన్రీ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక ఫిన్ అలెన్ (33 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100 నాటౌట్) రికార్డు సెంచరీకి టిమ్ సైఫర్ట్ (33 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 58) దూకుడైన ఇన్నింగ్స్ తోడవగా న్యూజిలాండ్ కేవలం 12.5 ఓవర్లలోనే 173/1 స్కోరు చేసి గెలుపొందింది. అలెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అలెన్ ఎడాపెడా బాదుడుకు సైఫర్ట్ దూకుడు తోడవడంతో మోస్తరు ఛేదనను కివీస్ ఇట్టే పూర్తి చేసింది. ఇక..టోర్నీలో ప్రత్యర్థి జట్లను బెదరగొట్టిన సఫారీ బౌలర్లు సెమీస్ పోరులో పూర్తిగా తేలిపోయారు. మొదటి ఓవర్‌నుంచే సైఫర్ట్, అలెన్ సఫారీ బౌలర్లకు చుక్కలు చూపారు. బాష్ వేసిన ఆరో ఓవర్లో ఒక సిక్స్ నాలుగు ఫోర్లతో అలెన్ కదం తొక్కడంతో పవర్ ప్లేలో 84/0తో న్యూజిలాండ్ సగం లక్ష్యాన్ని పూర్తి చేయడం విశేషం. పదో ఓవర్లో సైఫర్ట్‌ను రబాడ బౌల్డ్ చేయడంతో 117 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడి దక్షిణాఫ్రికాకు ఒకింత ఊరట లభించింది. మరోవైపు తగ్గేదేలే అంటూ అలెన్..యాన్సెన్ వేసిన 13వ ఓవర్లో 4,4,6,6,4తో 24 పరుగులు కొల్లగొట్టడం ద్వారా గ్రాండ్‌గా సెంచరీ పూరించడంతోపాటు జట్టును విజయ పథాన నిలిపాడు. స్పిన్నర్ల హవా..యాన్సెన్ ఎదురు దాడి: స్పిన్నర్లు అద్భుతంగా రాణించి దక్షిణాఫ్రికా బ్యాటర్లకు కళ్లెం వేసినా..మార్కో యాన్సెన్ ఎదురు దాడికి దిగి భారీ షాట్లతో హాఫ్ సెంచరీ సాధించాడు. బ్యాటింగ్‌కు కాసింత కష్టమైన పిచ్‌పై భారీ షాట్లు కొట్టే యత్నంలో సౌతాఫ్రికా బ్యాటర్లు వికెట్లు పారేసుకున్నారు. ఫలితంగా 77/5 స్కోరుతో తీవ్ర ఇక్కట్లలో పడగా యాన్సెన్ ఆదుకోవడంతో ఆ జట్టు గౌరవప్రద స్కోరు అందుకుంది. టోర్నీలో నిరాశాజనక ప్రదర్శనను కొనసాగిస్తూ ఓపెనర్ డికాక్ ఆదిలోనే నిష్క్రమించాడు.

# ఇంగ్లాండ్‌తో టీమిండియా కీలక పోరు..




టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. వాంఖడే స్టేడియంలో జరిగే టి20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్లో భారతజట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ సెమీస్‌లో విజేతగా నిలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో టైటిల్ పోరుకు అర్హత సాధించనుంది. ఈ మెగా టోర్నీలో టీమిండియా ఆశించినస్థాయిలో రాణించలేదు. లీగ్ దశలో సునాయాస విజయాల ను నమోదు చేసుకున్నా.. నిర్ణయాత్మక సూపర్-8 లో దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్యంగా ఓటమి పాలైంది. తాడో పేడో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను చిత్తుచేసి సెమీస్ బెర్త్ సంపాదించింది. గ్రూప్ దశలో అమెరికా, నమీబియా, పాకిస్తాన్, నెదర్లాండ్స్ జట్లను ఓడించి అజేయంగా సూపర్-8కు చేరుకుంది. సూపర్-8లో తొలి మ్యాచ్‌లోనే సౌతాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడిన సూర్యకుమార్ సేన.. ఆ తర్వాత జింబాబ్వే, వెస్టిండీస్‌లను ఓడించి సెమీస్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఇప్పటికే ముంబయి చేరుకున్న భారత ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, బుమ్రా నెట్‌ప్రాక్టీస్‌లో నిమగమయ్యారు. బ్యాటింగ్‌లో సంజు శాంసన్ ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం కాగా.. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ రాణిస్తే గెలుపు మనదే. బౌలింగ్‌లో బుమ్రాకి తోడు వరుణ్ చక్రవర్తి సత్తా చాటితే టీమిండియా ఫైనల్‌కు చేరడం ఖాయం.


ఇక ఇంగ్లండ్ విషయానికొస్తే... ఆ జట్టు లీగ్ దశలో నిరాశపరిచినా.. సూపర్-8లో వరుస విజయాలతో సెమీస్‌కు చేరింది. గ్రూప్-2లో న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంక జట్లను ఓడించి టాపర్‌గా నిలిచింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ దుర్భేద్యఫామ్‌లో ఉన్నాడు.

బౌలింగ్‌కి తోడు ఫీల్డింగ్‌లోనూ మిగిలిన జట్లను వెనక్కి నెట్టే ప్రదర్శన కనబర్చింది. ఇంగ్లండ్ మాజీ ఛాంపియన్ కాగా.. టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య జరిగే ఫైనల్ హోరాహోరీగా సాగడం ఖాయం.

**ఇండియా:** సూర్యకుమార్(కెప్టెన్), సంజు (వికెట్ కీపర్), అభిషేక్, ఇషాన్, తిలక్, హార్దిక్, దూబే, అక్షర్, వరణ్ చక్రవర్తి, రింకు సింగ్, బుమ్రా.




# నేడు థియేటర్లలోకి శ్రీవిష్ణు కొత్త సినిమా 'మృత్యుంజయ్'




యంగ్ హీరో శ్రీవిష్ణు ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మృత్యుంజయ్'. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ సినిమా మార్చి 6 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. పలు ప్రధాన కేంద్రాల్లో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయని, 'ఫాస్ట్ ఫిల్లింగ్' ట్రెండ్ కనిపిస్తోందని చిత్ర బృందం తెలిపింది.

భారత్‌లో రేపు విడుదల కానుండగా, ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే, నుంచే ప్రీమియర్ షోలు మొదలయ్యాయి. శ్లోకా ఎంటర్‌టైన్‌మెంట్స్, వైబ్రెంట్ సినిమాస్ సంస్థలు ఈ చిత్రాన్ని విదేశాల్లో విడుదల చేస్తున్నాయి. అక్కడ కూడా బుకింగ్స్‌కు మంచి స్పందన వస్తున్నట్లు సమాచారం.

హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీవిష్ణు సరసన రెబా మోనికా జాన్ హీరోయిన్‌గా నటించారు. కాలభైరవ సంగీతం అందించారు. ఎప్పుడూ కొత్తదనం నిండిన కథలను ఎంచుకునే శ్రీవిష్ణు నుంచి వస్తున్న సినిమా కావడంతో 'మృత్యుంజయ్'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ పాజిటివ్ బజ్‌తోనే ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# 12 నుంచి 'మేడ్ ఇన్ కొరియా' స్ట్రీమింగ్



ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్, తన కొత్త వెబ్ సిరీస్ 'మేడ్ ఇన్ కొరియా' ట్రైలర్‌ను బుధవారం విడుదల చేసింది. యువ నటి ప్రియాంక అరుళ్ మోహన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్, ఒక తమిళ యువతి కొరియాలో సాగించిన ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుంది. మార్చి 12 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ ప్రకారం, తమిళనాడులోని ఓ చిన్న పట్టణానికి చెందిన షెంబ అనే యువతి, దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు వెళ్తుంది. కొత్త ప్రదేశం, తెలియని మనుషుల మధ్య ఆమె తనను తాను ఎలా ఆవిష్కరించుకుంది, ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంది అనేదే ఈ కథ. తన కలల ప్రయాణంలో ఎదురైన ఊహించని మలుపులు, కొత్త పరిచయాలు షెంబ జీవితాన్ని ఎలా మార్చాయో ఈ సిరీస్‌లో చూపించనున్నారు.

ఈ సిరీస్‌పై ప్రియాంక మోహన్ మాట్లాడుతూ, "షెంబ పాత్ర నా మనసుకు చాలా దగ్గరైంది. అనిశ్చితిలో ధైర్యాన్ని కనుగొని, సొంతంగా నిలబడటాన్ని నేర్చుకోవడం ఈ కథలోని ముఖ్యాంశం. నెట్‌ఫ్లిక్స్‌తో నా తొలి ప్రాజెక్ట్ ఇదే కావడం చాలా ప్రత్యేకంగా ఉంది. ఈ కథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు.

రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ డ్రామాకు రా. కార్తీక్ దర్శకత్వం వహించడంతో పాటు కథను కూడా అందించారు. ప్రియాంక మోహన్‌తో పాటు దక్షిణ కొరియా నటులు పార్క్ హే జిన్, నో హో జిన్ కీలక పాత్రల్లో నటించారు. 'మేడ్ ఇన్ కొరియా' సిరీస్ మార్చి 12 నుంచి తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంటుంది.






# ఒళ్లు గగుర్పొడిచేలా నాగచైతన్య 'వృషకర్మ'



యువసామ్రాట్ నాగచైతన్య కథానాయకుడిగా, 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వృషకర్మ'. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్న ఈ వీడియో, సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ఇది కేవలం నిధి వేట చుట్టూ తిరిగే అడ్వెంచర్ సినిమా మాత్రమే కాదని, దుష్టశక్తులతో కూడిన ఒక మైథలాజికల్ థ్రిల్లర్ అని ఈ గ్లింప్స్ స్పష్టం చేసింది.

విడుదలైన వీడియోలో ఒక దుష్టశక్తి ఆవహించిన వ్యక్తి ఒక మనిషి కన్ను పొడిచినట్టు చిత్రపటం గీస్తాడు. అది పూర్తవగానే అతని నోటి నుంచి గబ్బిలం లాంటి భయంకర జీవి బయటకు వచ్చి, ఆ చిత్రపటంలో ఉన్నట్టే ఒక వ్యక్తిని చంపేస్తుంది. "ఒక సాటిలేని శక్తి మేల్కొన్నప్పుడు... సృష్టి దాని గమ్యం తప్పినప్పుడు... విధి తన దారిని తానే ఎంచుకుంటుంది" అనే వాయిస్ ఓవర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ వీడియోలో నాగచైతన్య, మీనాక్షి చౌదరి, జయరాం పాత్రలను కూడా పరిచయం చేశారు.

ఈ సినిమాపై నాగచైతన్య గతంలో చెప్పిన మాటలను ఈ గ్లింప్స్ నిజం చేస్తోంది. "ఇది భారీ వీఎఫ్ఎక్స్‌తో కూడిన మైథలాజికల్ థ్రిల్లర్. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఇంత భారీ స్పాన్‌లో సినిమా చేయలేదు" అని చైతన్య గతంలో పేర్కొన్నారు. ఇప్పుడు విడుదలైన వీడియో చూస్తే ఆయన చెప్పింది నిజమేననిపిస్తుంది.

ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర (ఎస్వీసీసీ), సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నీల్ డి కున్హా సినిమాటోగ్రఫీ, అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**